క్లుప్తంగా

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి

ఓర్వకల్లు: పత్తి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఏఓ మధుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు పంట వేసిన 45-50 రోజులకు ప్రొఫెనోఫాస్, 115 రోజులకు ఇమిడాసైహలోత్రిన్ పిచికారీ చేసుకోవాలన్నారు. లింగాకర్షక బుట్టలు అమర్చుకోవడం వల్ల గులాబీ రంగు పురుగును నివారించుకోవచ్చన్నారు. పేను బంక నివారణకు ఎకరాకు 80 మి.లీ ఇమిడాక్లోప్రిడ్/ 250 మి.లీ డైఫెంతూరియన్ సర్ఫును కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, వీఏఏలు సౌజన్య, అనిత పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఆట్యా.. పాట్యా క్రీడలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పాణ్యంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఆట్యా.. పాట్యా క్రీడా పోటీల్లో 8, 9 చదవుతున్న అర్జున్‌తేజ్, జహరుద్దీన్, తేజనాయక్, బాలు నాయక్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి రూఫస్ రోనాల్డ్

కర్నూలు(రూరల్): పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని కర్నూలు మండల వ్యవసాయ అధికారి రూఫస్ రోనాల్డ్ చెప్పారు. బుధవారం మండల పరిధిలోని ఆర్.కొంతలపాడు, బసావపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పత్తి పంటలను పరిశీలించారు. పత్తి పంటలో గులాబీ పురుగు ఉధృత్తిని గమనించి దాని నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పంట నమోదు చేయించుకోండి



కొత్తకోటలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కొత్తకోట, ఈర్లదిన్నె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి పంటల సంరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన యూరియా అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఏఏ రవిసాగర్, ప్రవీన్, ఎంపీఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

గడివేములలో ట్రాఫిక్ కష్టాలు

- రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి దుకాణాల ఏర్పాటు
- జిందాల్ భారీ వాహనాలతో రాకపోకలకు అంతరాయం

ట్రాఫిక్ సమస్య గడివేములలో రోజురోజుకు పెరిగిపోతోంది. ఒకే ప్రధాన రహదారి ఉండటం.. దుకాణదారులు రోడ్డుకిరువైపులా ఆక్రమించుకోవడంతో ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు జిందాల్ ఫ్యాక్టరీకి చెందిన భారీ వాహనాలు మండల కేంద్రంలో నుంచే రాకపోకలు సాగిస్తుండటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. భారీ వాహనాల రాకపోకలపై మండల కేంద్రం వాసులు గతంలో అభ్యంతరం తెలపడంతో కొన్ని రోజులు మాత్రం వేరే రూట్ నుంచి పంపించేశారు. ఆ తర్వాత మళ్లీ యథావిధిగా మండల కేంద్రం నుంచే రాకపోకలు సాగిస్తుండటంతో సమస్య మొదటికొచ్చింది.

– గడివేముల



గడివేముల పాతబస్టాండ్‌లో ట్రాఫిక్‌జామ్ అయిన దృశ్యం



గడివేముల పాతబస్టాండులో భారీ వాహనాల రాకపోకల దృశ్యం



బూజునూరు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డు

గడివేముల మండల కేంద్రంలోని సినిమా హాల్ వద్ద నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు రోడ్డు వెంట అక్రమ కట్టడాల వల్ల రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, హైస్కూల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు కొంతమంది ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఇతరులకు అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ రహదారిలో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు ఉండటంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

నిబంధనలు తూచ్..

జిందాల్ ఫ్యాక్టరీకి చెందిన భారీ వాహనాలు నిబంధనలు పాటించడం లేదు. కొన్ని రోజుల క్రితం రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉండేది. నిబంధనలను అతిక్రమించి ఎప్పుడుపడితే అప్పుడు వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, వివిధ పనులపై రాకపోకలు సాగించా వారికి తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఒక్కోసారి గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఫ్యాక్టరీ వద్ద నుంచి నంద్యాల వెంకటేశ్వరపురం వరకు సీసీ రోడ్డును నిర్మించుకుంది. జిందాల్ వాహనాలు ఆ రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే కొంత మంది ట్రాన్స్‌పోర్టు యజమానులు మైలేజీ కోసం గడివేముల మీదుగా భారీ వాహనాలు నడుపుతున్నారు. దీంతో రోడ్డు దెబ్బతినడంతోపాటు పాత బస్టాండు ప్రాంతంలో మలుపు వద్ద ఒక్కోసారి వాహనాలు ఇరుక్కుపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

బైపాస్ ఎప్పుడో...

ఎన్నికల సమయంలో కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే బైపాస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంత వరకు బైపాస్ ఊసే లేదు. రూ.2 కోట్లతో బైపాస్ ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో మండల వాసులు ఎదురు చూస్తున్నారు.

రోడ్లు దెబ్బతింటున్నాయి



భారీ వాహనాలు గడివేములలో నుంచే రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దెబ్బ తింటోంది. బూజునూరు గ్రామం నుంచి గడివేములకు వెళ్లే రహదారి ఇప్పటికే ఛిద్రమైంది. ఇక తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. భారీ వాహనాలు గడివేములలోకి రాకుండా బైపాస్ ఏర్పాటు చేయడమే శాశ్వత పరిష్కారం.

– చిన్నపాలు, బూజునూరు గ్రామం

స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు ఉద్యమం



సి.బెళగల్లో స్మార్ట్ మీటర్ల రద్దుకు ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సి.బెళగల్: కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు తీసుకొచ్చిన కరెంట్ స్మార్ట్ మీటర్లను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక డివిజన్ నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, హమాలీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రం సి.బెళగల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను, అదానీతో చేసుకున్న సెకీ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ట్రూ అప్ చార్జీలు, ఇతర సర్ చార్జీల పేరుతో ప్రజలకు భారం వేయరాదన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం కూటమి సర్కారుకు తగదన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు పోలకల్ అక్బర్, ఏఐటీయూసీ నాయకుడు మల్లికార్జున, రైతు సంఘం నాయకుడు ఖాజా హుసేన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు సుందర్‌రాజ్‌లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల గోడు పట్టడం లేదన్నారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు జైలు, నాగన్న, భాస్కర్, మాబు, రది, శాంతన్న, హుసేనప్ప, బాలు, పెద్ద హుసేన్, గోపాల్, వెంకప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి రాజు కోరారు. బుధవారం ఆ మహాసభల వాల్‌పోస్టర్లను కోడుమూరులో నాయకులు, కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జిల్లా రైతులు నిత్యం కరువు కాటకాలతో అల్లాడిపోతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లాలో ఉపాధి కరువై రైతులు, కార్మికులు వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించి జిల్లా రైతులు, ప్రజలకు సాగు, తాగు నీటినందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు కర్నూలులో ఈనెల 9 నుంచి 11వతేదీ వరకు జరగనున్న 24వ సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రాముడు, సీపీఐ పట్టణ కార్యదర్శి శేషకుమార్, ఆటో, హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజ్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్

కోడుమూరు రూరల్: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆ కళాశాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఉదయ్ మాట్లాడుతూ గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 200 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, అయితే కాలేజికి వచ్చి వెళ్లేందుకు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరియైన బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కళాశాలలో తరగతి గదుల సమస్య తీవ్రంగా ఉందని, తగినన్ని తరగతి గదులు, టాయ్‌లెట్స్ లేవన్నారు. జిల్లా అధికారులు స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఖాజావలి, మండల నాయకులు వేణు, అరవింద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న సీఈఓ నాసరరెడ్డి

ఓర్వకల్లు: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా బుధవారం మండలంలోని నన్నూరు గ్రామాన్ని సీఈఓతో పాటు, డీపీఓ భాస్కర్, ఎంపీడీఓ శ్రీనివాసులు వేర్వేరుగా సందర్శించారు. ముందుగా తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. అనంతరం వీధులను తనిఖీ చేసి, ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ ట్రాక్టర్ వస్తుందా? లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి, వాటిలో తడి, పొడి చెత్తలను వేరు చేసి ఊరు బయట వున్న చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. చెత్త సేకరణపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా గ్రామ సమాచారాన్ని కోరినప్పుడు, ఏవిధంగా సమాధానం ఇవ్వాలని అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను నిర్దేశించిన తేదీలలో శుభ్రం చేసి, క్లోరినేషన్ తేదీలను పరిశీలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి షేక్ బసిరున్నీషా, గ్రీన్ అంబాసిడర్లు, స్థానిక నాయకులు విజయుడు, ఖాజామియా, శంషుద్దీన్, కటిక హసన్ పాల్గొన్నారు.





అధినేత వైఎస్ జగన్‌తో...

డోన్‌లో బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్

జిల్లాలో కుండపోత వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి 11 గంటల నుంచి మొదలైన వర్షాలు బుధవారం ఉదయం వరకు కురిశాయి. అత్యధికంగా నందవరం, అత్యల్పంగా సి.బెలగల్‌లో వర్షపాతం నమోదైంది. రుతుపవనాలు చురుగ్గా ఉండటం వల్ల వర్షాలు కురుస్తున్నాయి. ఓర్వకల్ మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున ఒక్క రోజులో 29.3 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. మొదటి ఆరు రోజుల్లో 44 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న నాలుగు రోజుల్లో కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

మండలం	వర్షపాతం(మి.మీ)
నందవరం	88.6
తుగ్గలి	84.2
చిప్పగిరి	82.6
ఆలూరు	76.4
హాలహర్వి	57.6
పెద్దకడుబూరు	48.4
హొళగుంద	45.2
దేవనకొండ	33.4
మంత్రాలయం	32.2
ఎమ్మిగనూరు	31.6
పత్తికొండ	30.2
మద్దికెర	30.2

తల్లి పాలు బిడ్డకు అమృతం





మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాలమ్మ, తల్లి పాల గురించి మహిళలకు వివరిస్తున్న సీడీపీఓ వరలక్ష్మి

పాణ్యం: తల్లి పాలు బిడ్డల ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాలమ్మ అన్నారు. బుధవారం స్థానిక 6, 7 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతిబిడ్డకు ముర్రుపాలు తాపించాలన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. పుట్టిన ప్పటి నుంచి బిడ్డకు 2 ఏళ్ల వయస్సు వచ్చేంత వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు.

కోడుమూరు రూరల్: తల్లి పాలు బిడ్డకు బలమని, ఆరునెలల వరకు తల్లి పాలే ఇవ్వాలని కోడుమూరు సీడీపీఓ వరలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఐసీడీఎస్ పరిధిలోని చనుగొండ్ల, ప్యాలకుర్తి గ్రామాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు కామెర్లు, ఇన్‌ఫెక్షన్స్ రాకుండా ఉంటాయన్నారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి కూడా పెంపొందుతుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రాజమ్మ, పద్మావతి, జమీల, జరీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజరు, అంగన్‌వాడీ కార్యకర్తలు

అమ్మపాలే బిడ్డకు మేలు

కర్నూలు(రూరల్): తలి పాలు బిడ్డకు అమృతంతో సమానమని అంగన్ వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండల పరిధిలో గార్గేయపురం బీసీ కాలనీ మండల ప్రాథమిక పాఠశాలలో తల్లిపాలు వారోత్సవాలపై కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలసి సూపర్ వైజర్, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది, ఏఎన్‌ఎమ్‌లు, ఆశాలు, బీసీ కాలనీలో ర్యాలీ నిర్వహించారు.

బస్టాండ్‌లో బంకులు తొలగించాలని వినతి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని బస్టాండ్ ఆవరణలో ఉన్న పండ్లు, పూలు, కూరగాయల బంకులను తొలగించాలని తప్పెట కళాకారుల సంఘం నాయుడు జోజి కోరారు. బుధవారం ఆయన తహసీల్దార్ వెంకటలక్ష్మిని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆక్రమణలతో బస్టాండ్ ఇరుకుగా మారిందన్నారు. బంకులు తొలగిస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదన్నారు.

నేడు హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 7వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికవుతారని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జిల్లా వాసులై ఉండాలని, ఆధార్ కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన ఐడీ కార్డు తీసుకురావాలన్నారు. 22 ఏళ్లలోపు స్త్రీలు, పురుషులు పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 90004 93408 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గోరుకల్లులో అరకొర నీరు

- రైతు సంఘం నాయకులు



గోరుకల్లు జలాశయాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గోరుకల్లులో అరకొర నీరు నిల్వ ఉంచారని రైతు సంఘం నాయకులు ఆరోపించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి, సాగునీటి రంగ విశ్లేషకులు తుంగ లక్ష్మీ నారాయణ, రైతుసేవా అధ్యక్షుడు భవానీప్రసాద్, సామాజిక వేత్త జొన్నగడ్డ రామారావు, మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు తదితరులు బుధవారం గోరుకల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోరుకల్లు జలాశయంలో 12టీఎంసీల నీరు నిల్వ ఉంచుకునే సామర్థ్యం ఉన్నా కేవలం 8 టీఎంసీలు మాత్రమే ఉంచారంటే ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. పెండింగ్ పనులకు రూ. 53కోట్లు అవసరమవుతామయని ఇంజినీర్లు సూచించారని, వెంటనే ప్రభుత్వం ఈ నిధులను విడదల చేయాలన్నారు. లేనిపక్షంలో రాయలసీమకు నీటి సమస్య తప్పదన్నారు.

వర్షం కురిసేనా.. విత్తు పడేనా!

- వానల కోసం అన్నదాతల ఎదురుచూపు



బొల్లవరం సమీపంలో విత్తనానికి సిద్ధంగా ఉన్న పొలం

గడివేముల: వానాకాలం వచ్చినా మబ్బులే తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. వ్యవసాయానికి అవసరమైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలైన తొలకరి పలకరింపు కోసం గత రెండు నెలల నుంచి ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. జూలై నెలలో మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఆరంభంలోనే వరుణ దేవుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనులు చేపట్టారు. అరకొరగా విత్తనాలు వేసిన పంటలకు యూరియా దొరక్కపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కానీ ప్రస్తుతం వరుణుడి జాడే కనిపించడం లేదు. ఆగస్టు నెల వచ్చినా కార్తెలు వెళ్లిపోతున్నా నేటికీ సరైన వర్షాలు కురవడం లేదు. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం భానుడి భగభగలతో మండిపోతోంది. నాలుగు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీలు నమోదవుతున్నాయి. మండే ఎండలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరగడమేగాక రాత్రి పూట కూడా వాతావరణం వేడిగానే ఉంటోంది. కానీ ఇప్పటికీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. మెట్ట ప్రాంత రైతులు వర్షాలు కురుస్తాయని ఆశతో రైతులు పొలాలు సేద్యం చేసి విత్తనాలు నాటారు. అరకొరగా మొలచిన వర్షాలు కురవకపోవడంతో వాడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 22 వేల దాకా వివిధ పంటలను సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.